
# మినీకథ



## స్పెషలిస్ట్

లక్కీగా మా ఆఫీసుకి వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో ఎప్పటి నుంచో వెళ్దాం అనుకుంటున్న హైదరాబాదు ప్రయాణం పెట్టుకున్నాను. హైదరాబాదులో నా స్నేహితుడు రామం ఉంటున్నాడు. వాడితో సరదాగా కాలం గడిపి ఎన్నేళ్ళయిందో! అనుకుంటూ హుషారుగా గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాను. సర్‌ప్రయిజ్ విజిట్ యిద్దామని నేను వస్తున్నట్లు వాడికి ఉత్తరం రాయలేదు. ట్రెయిన్ లేటయి పది గంటలకి హైద్రాబాద్ చేరింది. నాకు ఒక్కసారిగా బోల్డు నీరసం వచ్చేసింది. వాడీపాటికి ఆఫీసుకు పోయుంటాడు. ముందుగా ఉత్తరం రాసినా బాగుండును. సెలవు పెట్టి ఇంట్లో వుండేవాడనుకుంటూ దిగులుగా ఆటో ఎక్కాను. ఇంటి ముందు దిగి కాలింగ్‌బెల్ నొక్కగానే వాడే తలుపు తీశాడు. నేను వెంటనే చాలా ఆనందంగా ఆశ్చర్యపోబోయి వాడు చాలా దిగులుగా కన్పించేసరికి ఆ రెండు పన్లూ అప్పటికి వాయిదా వేసేసి "ఏమిట్రా అలా వున్నావు!" అని మాత్రం అనగలిగాను. నాకు సమాధానంగా "ముందా పళ్ళు తోముకుని స్నానం చేసిరా" అని బాత్రూం చూపించాడు.

మరో అరగంటకి యిద్దరం ఓ ఇరానీ రెస్టారెంట్‌లో టీ చప్పరిస్తున్నాం. నేను ఒక సారి వాడి మొఖం వైపు చూసి యిందాకటి ప్రశ్నే రిపీట్ చేశాను.

"కారణం చెప్తాను కానీ, నా మీద భయంకరంగా జాలిపడకుండా వుంటావా?"

వాడడిగిన ప్రశ్నకి నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. అయినా అంతమంచి ఫ్రెండు యింత చిన్న కోరిక కోరితే తీర్చలేనా? వెంటనే 'సరే చెప్పు' అన్నాను.

"నాకీమధ్య కొంత కాలంనించి కుడి చెవిలోంచి చీము కారుతోంది. నొప్పి వస్తోంది."

"అయ్యో! పాపం" అనబోయి వెంటనే మానేశాను.

వాడు నా ముఖంలోకి ఓసారి దీర్ఘంగా చూసి మళ్ళా చెప్పడం మొదలుపెట్టాడు.

"అసలీ జబ్బు ఒక నెలక్రితం మొదలయింది. మా ఇంటి వీధిలో చివర 'ది న్యూ ఇండియా క్లినిక్ డాక్టర్ రవిశంకర్ ఎమ్బీబియ్యస్' అనే బోర్డు వుంది చూశావా? చెవి చూపిద్దామని ఆ డాక్టరు దగ్గరకి వెళ్ళాను ఓ సాయంత్రం. ఆయన పరీక్షచేసి మాత్రలు రాసిచ్చాడు. మర్నాడు ఉదయం నేనా మాత్రలు కొందామని మెడికల్‌స్టోర్స్‌కి వెళుతూఉంటే మా ఆఫీసులో నా కొలీగ్ గోపాలరావు కన్పించాడు. మాటల సందర్భంలో నా విషయం తెల్పి మా ఆఫీసరుగారి బంధువు ఒకాయన E.N.T. స్పెషలిస్టు ఈ ఊళ్ళోనే ఉంటున్నాడని ఆయనదగ్గరకి వెళ్ళమని చెప్పాడు. సరేనని మాత్రలు కొనడం మానేసి మా ఆఫీసరుగారింటికి వెళ్ళాను. స్పెషలిస్టు డాక్టరుకి మా ఆఫీసరుగారిచేత ఓ సిఫార్సు లెటరురాయించుకుని, ఆరోజుకి సెలవుచీటీ రాసి ఆయనకిచ్చి ఆ స్పెషలిస్టు డాక్టరుగారి దగ్గరకి వెళ్ళాను. నా దగ్గరవున్న లెటరు కాంపౌండరుకి యిచ్చి డాక్టరుగారికి పంపాను. రెండు నిముషాల్లో కాంపౌండరు నవ్వుతూ వచ్చి "మీరు చాలా అదృష్టవంతులండి!" అన్నాడు. నాకెందుకో అర్థం కాలేదు. "డాక్టరుగారు 15 రోజులు ముందుగా అపాయింట్‌మెంట్ లేందే ఎవర్నీ చూడరు. కానీ మీకు నాలుగు రోజుల్లో యిచ్చారు. మీరు 10వ తారీఖు 10 గంటలకి రండి!" నాకా విషయానికి ఆనందించాలో, విచారించాలో అర్థం కాలేదు. కానీ చెవినొప్పి, ఎక్కువగా వుండటంతో యింటికి వచ్చేసి పడుకున్నాను.

పదవ తారీఖు మళ్ళా సెలవుపెట్టి డాక్టరు దగ్గరకి వెళ్ళాను. డాక్టరుగారు నా చెవి పరీక్షచేసి 50 రూపాయలుపుచ్చుకున్నారు. తలకి ఎక్సరే తీయించి 30 రూపాయిలు పుచ్చుకుని మరో రెండు టెస్ట్‌లు చెయ్యాలి; మర్నాడు రమ్మన్నారు.

మర్నాడు మళ్ళా ఆఫీసుకి సెలవు పెట్టి హాస్పిటలుకి వెళ్ళాను. రెండు టెస్టులూ పూర్తయ్యాయి. నా జేబులో వంద రూపాయలూ పూర్తయ్యాయి. మధ్యాహ్నానికి చేతిలో ఓ సిఫార్సు లెటరుతో బయట

యన్. ప్రభావతి

పద్దాను ఆస్పత్రి నుంచి. ఆ లెటరు ఓ మైక్రోబయాలజిస్టుకి రాశారుట. తిన్నగా ఆ డాక్టరు దగ్గరికి వెళ్ళాను. ఆయన నా చెవిలో చీము స్వాబ్ తీసుకుని నా దగ్గర ఓ 50 రూపాయలు తీసుకుని, "మూడు రోజుల తర్వాత రారిపోర్టు సిద్ధంగా వుంటుంది" అన్నాడు. దానికి కల్చర్ సెన్సిటివిటీ చేస్తారుట. సరేనని మూడు రోజుల తర్వాత ఆయన దగ్గరకి వెళ్ళి రిపోర్టు తీసుకుని ఇఎన్‌టి స్పెషలిస్టు దగ్గరకి వెళ్ళి చూపించాను. ఆయన మళ్ళా నా చెవి ఓ సారి పరీక్ష చేసి రీ ఎగ్జామినేషను ఫీజు పాతిక రూపాయలు పుచ్చుకుని. గంభీరంగా ఓసారి నవ్వి "ఏం ఖంగారు లేదోయ్! ఈ మాత్రలు వాడు తగ్గిపోతుంది" అని రాసిచ్చారు. నేను ఆయనకి థాంక్సు చెప్పి ఆ చీటీ తీసుకుని వెళ్ళి మందులషాపులో మాత్రలు కొంటూ ఉంటే ఆ పేరెక్కడో విన్నట్లుగా అన్పించింది. ఎందుకో అనుమానమేసి నా బీరువా తీసి "ది న్యూ యిండియా క్లినిక్. డాక్టరు రాసిన మాత్రల చీటీ వెదికి తీశాను. అది చూసినప్పటినుంచీ యిలాఅయిపోయాన్రా. ఆ రెండుమాత్రలూ ఒక్కటే!" అంటూ ముగించాడు. నాకు వాడిమీద విజంగా జాలేసింది. కాని యిచ్చినమాట ప్రకారం జాలిపడటం మానేసి మరేం చెయ్యాలో తెలీక మరో రెండు "టీ"కి ఆర్డరిచ్చాము.

గమనిక :– ఇది ఏ స్పెషలిస్టునూ కించపరిచే వుద్దేశంతో వ్రాసినది కాదు. మధ్యతరగతి వారికి యింకా తక్కువ ఆదాయం కలవారికీ కూడా స్పెషలిస్టులు అందుబాటులో వుండాలన్న ఆశతో వ్రాసినది మాత్రమే.

## మినీకథ



# ఆశాసౌధం

రమ, నేను చిన్నప్పటి నుంచి స్నేహితులం. రమ అంత పేరున్న రచయిత్రి కాకపోయినా అది వ్రాసిన కథలు అప్పుడప్పుడు పత్రికల్లో వస్తూవుండేవి.

ఒకరోజు రమ నాతో– "లక్ష్మీ నా కథ వీక్లీలో పడిందోయ్" అంది.

వెంటనే "పత్రికవాళ్ళు ఎంతిస్తారేంటి" అన్నాను. ఆ ఎంతలే పాతికో, ఏభయ్యో అంది. ఆ రోజునుంచి నాకు కంటిమీద కునుకు లేదు. రోజల్లా పనిచేసేదాన్నిగాని దృష్టంతా రమలాఎప్పుడుకథలు రాద్దామా, ఎప్పుడు సంపాదిద్దామా అని. పనంతా చేసుకుని రాత్రి భోజనాలయ్యేక కూర్చునేదాన్ని. రెండ్రోజులు ఎన్ని పేజీలు వ్రాసి చింపిపారేశానో! కథ సమంగా రాలేదు సరికదా నిద్ర చాలక నీరసం పట్టుకుంది.

మూడో రోజు తెల్లవారుఝామున మంచి ప్లాట్ తట్టింది. వెంటనే రాసేశాను పది పేజీలు. కథ నా మటుకు చాల బాగుందనిపించింది. వీక్లీకి ఆ రోజే పంపించేశాను.

కాలేజీలో చదివే మా పెద్దపిల్ల "అమ్మా జోళ్ళు ఎప్పటినుంచో కొంటానంటున్నావ్, ఎప్పుడు కొంటావు" అంటే.

"ఇంకెంతమ్మా ఒక్క పదిహేను రోజులు గడుపుకో శుభ్రమైనవి కొనుక్కుందువుగాని" అన్నాను.

రెండోవాడు బాబుకి నిక్కర్లు కొనాలని ఏ నెలకానెల ఇంటికి కావలసిన సామానులన్నీ కొన్నాక యిరవయ్యో, ముప్పయ్యో మిగుల్తే కొనవచ్చు ననుకుంటే, అన్నీ కొనగా మిగిలే దేమిటి? నా మొహం:

ఎప్పటినుంచో మనసుపడి కొనుక్కున్న గులాబీరంగు పాలిస్టర్ చీరకి మాచింగ్ బ్లౌజు కొనుక్కోవాలని. మీటరు 27 రూపాయల ఖరీదు తల్చుకుంటే ప్రాణం ఉసూరుమనిపించేది. మావారు మాత్రం పాపం ఏమీ కొనుక్కోవాలని అనుకునేవారు కాదు. నిద్రపోతున్నా, ఏ పని చేస్తున్నా కథ ప్రచురించడానికి అంగీకరించినట్లు, తరువాత వచ్చే యాభై రూపాయలతో ఏం కొనాలన్న ధ్యాసే!

పోస్టులో వీక్లీ వచ్చింది.

అందులో నా కథ!

తరువాత యాభై రూపాయలు మనియార్డరు. దేవుడికి ఇస్తానన్న లంచం రూపాయి వెంటనే పెట్టేశాను.

అమ్మాయికి జోళ్ళు, బాబుకి నిక్కర్లు, మా వారికిష్టమైన జిలేబీలు. ఆఫీసు నుంచి యింటికి వచ్చిన మాశ్రీవారికి నాచేతులతో తినిపించాలని.

"ఏమండీ! మిమ్మల్నే మీ కిష్టమైన జిలేబీలు తెప్పించాను. ఇంకో రెండు తినండి."

"ఇదిగో చూడు– తెల్లవారింది గాని త్వరగాలేచి కాఫీ తయారుచెయ్యి, కేంపుకి వెళ్ళాలి. ఇంతకీ జిలేబీలు అంటున్నావేమిటి? ఏదేనా లాటరీ వచ్చినట్లు కల వచ్చిందేమిటి?" అన్న మా శ్రీవారి మాటలకి తెలివి వచ్చింది. అప్పుడనిపించింది యిదంతా కలని. మా నాయనమ్మ తెల్లవారు ఝామున వచ్చే కలలు తప్పకుండా నిజమౌతాయని చెప్పేది. నాలో ఆశ చావలేదు. పదిగంటలకి పోస్టుకేక విని పరుగెత్తు కొచ్చాను. తిరిగి వచ్చిన నా కథ నన్ను చూసి వెక్కిరించింది. తపాలా స్టాంపులు సరిపోలేదని, ఏభై పైసలిచ్చి నా కథను నేను విడిపించుకోవలసి వచ్చింది.

—ఓరుగంటి లక్ష్మీరామకృష్ణ